ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
మంగళవారం 13 ఫిబ్రవరి 2024

అమాయక ప్రాణాలకు 'ఉచ్చు'

- వన్యప్రాణుల కోసం తీగలు అమర్చిన వేటగాళ్లు
- విద్యుత్ ఉచ్చుకు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బలి
- భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో విషాదం

7



ప్రవీణ్(ఫైల్) రమేష్(ఫైల్)



పూర్తయిన కల్యాణ మండపం

7

'కల్యాణ' వైభోగమే..

- పూర్తయిన వేయిస్తంభాల గుడి కల్యాణ మండపం పనులు
- ఈనెల 18న ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు
- కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాక
- ఏర్పాట్ల పర్యవేక్షణకు నేడు నగరానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- పద్దెనిమిదేళ్ల తర్వాత ఎట్టకేలకు పూర్వరూపం
- రూ.15కోట్ల వ్యయంతో పునరుద్ధరణ పనులు

"హనుమకొండలోని వేయిస్తంభాల గుడి చారిత్రకంగా ఎంతో సుప్రసిద్ధమైంది. కాకతీయుల మహోజ్వల ఘట్టానికి నిలువెత్తు నిదర్శనమైన 850 ఏళ్లనాటి పురాతన కట్టడమిది. వేయిస్తంభాలగుడి, దానికి అనుబంధంగా నిర్మించిన కల్యాణ మండపం రమణీమైన శిల్పకళా ప్రతిభకు నిలువెత్తు నిదర్శనం. మండపం మొత్తాన్ని రాతి స్తంభాలతోనే దీనిని నిర్మించారు. ఆ కాలంలో ఈ మండపంలో ఉదయం, సాయంత్రం నాట్యప్రదర్శనలు జరుగుతుండేవని శాసనాలను బట్టి తెలుస్తోంది. అలాంటి చారిత్రక ప్రదేశం 18 ఏళ్ల కిందట కుంగుబాటుకు గురైంది. కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో మండపం పునరుద్ధరణ పనులు చేపట్టారు. మండపం పునరుద్ధరణ పనులకు కేంద్ర ప్రభుత్వం రూ.7కోట్లను కేటాయించింది. పెరిగిన వ్యవయాన్ని దృష్టిలో ఉంచుకొని మరో రూ.5.50 కోట్లను కూడా మంజూరు చేసింది. పనులు పూర్తి అయి ఎట్టకేలకు ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు." - హనుమకొండ, ఆంధ్రజ్యోతి



మేడిగడ్డ బ్యారేజీ వద్ద సభావేదిక నిర్మాణం కోసం కొనసాగుతున్న పనులు



నేడు మేడిగడ్డకు సీఎం

బ్యారేజీ వద్ద ముమ్మరంగా ఏర్పాట్లు

- పార్కింగ్ ప్రదేశాలతోపాటు సభాస్థలి నిర్మాణం
- గోదావరిలో కుంగిన పిల్లరు వద్ద డీవాటరింగ్

మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 12: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లోని మేడిగడ్డకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం వస్తున్నారు. మంత్రివర్గ సభ్యులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు చోటుచేసుకున్నాయనే ఆరోపణల నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలనకు ఈ బృందం రానుంది. ఈ పర్యటనపై సీఎం ఇప్పటికే అసెంబ్లీలో ప్రకటించారు. రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సుమారు 40 బస్సుల్లో మేడిగడ్డకు రానున్నారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. మేడిగడ్డ బ్యారేజీ సందర్శన అనంతరం సమీపంలోని హోమశాల వద్ద పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. బ్యారేజీ నిర్మాణ లోపాలను వివరించనున్నారు. ఈ సందర్భంగా జరిగే సభలో ముఖ్యమంత్రి ప్రసంగించనున్నారు.

ఇందుకు అధికారులు వేదికను ఏర్పాటు చేస్తున్నారు. వీఐపీ పార్కింగ్, విడిది ప్రదేశాలను ఇప్పటికే సిద్ధం చేశారు. అలాగే బ్యారేజీ వంతెనపై కుంగిన పిల్లరు మీదుగా మహారాష్ట్ర వైపు నుంచి గోదావరి నదిలో పగుళ్లు తేలిన పిల్లర్ల వద్దకు రేవంత్‌రెడ్డి బృందం వెళ్లనుండగా అక్కడ సైతం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా బ్లాక్-7లోని 20వ పిల్లరును ముఖ్యమంత్రి పరిశీలించే అవకాశం ఉండటంతో ఆ ప్రదేశంలో ఊటల ద్వారా వస్తున్న నీటిని డీవాటరింగ్ చేస్తున్నారు. కుంగిన ప్రాంతంలో కాంక్రీటు పగుళ్లు తేలడంతో గోదావరి ప్రవాహాన్ని మరల్చేందుకు ఏర్పాటు చేసి మట్టి కట్టల ద్వారా ఊటలు ఉబికివస్తున్నాయి. దీంతో పెద్ద మోటార్లను ఏర్పాటు చేసి నీటిని తొలగిస్తున్నారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి వచ్చే మార్గాల్లో సైతం స్వల్ప మార్పులు చేశారు. బొమ్మాపూర్, ఎల్కేశ్వరం, సూరారం మీదుగా మేడిగడ్డకు ముఖ్యమంత్రి బృందం చేరుకుంటుందని రూట్‌మ్యాప్ సిద్ధం చేయగా సోమవారం దానిని మార్చేశారు. కుదురుపల్లి వద్ద నుంచి మహదేవపూర్ మండల కేంద్రం, ఎల్అండ్‌టీ రోడ్డు మీదుగా నేరుగా మేడిగడ్డ బ్యారేజీకి ముఖ్యమంత్రి, మంత్రివర్గ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చేరుకోనున్నారు. తిరిగి అదేమార్గంలో హైదరాబాద్‌కు వెళ్లిపోనున్నారు. మహదేవపూర్ నుంచి వెళ్లే మార్గంలో సుమారు ఐదు గ్రామాలు ఉండటంతో ట్రాఫిక్‌పరంగా ఇబ్బందులు తలెత్తుతాయనే ఉద్దేశంతో రూట్‌ను మార్చినట్లు సమాచారం.

బస్సులో వచ్చి.. హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు..

హైదరాబాద్ నుంచి ఏసీ బస్సుల్లో ఉదయం 9.30 గంటలకు బయల్దేరనున్న ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మధ్యాహ్నం 2 గంటలకు మేడిగడ్డకు చేరుకోన్నారు. బ్యారేజీ వద్ద పరిశీలన, సభ అనంతరం మంత్రులు, ఎమ్మెల్యే తిరిగి హైదరాబాద్‌కు బస్సుల్లో బయల్దేరనున్నారు. ముఖ్యమంత్రి మాత్రం మేడిగడ్డ నుంచి హెలిక్యాప్టర్ ద్వారా హైదరాబాద్‌కు తిరిగి వెళ్లనున్నారు.



బ్యారేజీ 20వ పిల్లరు వద్ద ఊటల ద్వారా వస్తున్న నీటిని డీవాటరింగ్ కోసం ఎత్తిపోస్తున్న మోటార్లు

పర్యటన ఇలా..

- ఉదయం 9.30 గంటలకు రోడ్డు మార్గాన హైదరాబాద్ నుంచి మేడిగడ్డకు బయల్దేరుతారు.
- మధ్యాహ్నం 2గంటలకు మేడిగడ్డ బ్యారేజీకి చేరుకుంటారు..
- 2 నుంచి 3గంటల వరకు బ్యారేజీ వంతెన, కుంగిన పిల్లర్లను ఎరిశీలించనున్నారు.
- మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమై సమీక్షించనున్నారు.
- సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు మేడిగడ్డ బ్యారేజీ పరిస్థితి, గత ప్రభుత్వ వైఫల్యాల గురించి మీడియాతో సీఎం మాట్లాడతారు.
- సాయంత్రం 5గంటలకు తిరిగి హైదరాబాద్‌కు వెళతారు.

పారిశుధ్య సేవకు సిద్ధం

- మేడారం జాతరకు బల్దియా పారిశుధ్య కార్మికులు
- భక్తుల సేవలకు 550 మంది కేటాయింపు
- ప్రస్తుతానికి 30 స్వచ్ఛ ఆటోల కేటాయింపు



జీడబ్ల్యూఎంసీ (హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 11: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర విధుల నిర్వహణకు వరంగల్ మహానగర పాలక సన్నద్ధమవుతోంది. ఈమేరకు అధికారగణం ప్రణాళికను రూపొందిస్తున్నారు. కోటికి పైగా వచ్చే భక్త జన సందోహ జాతరలో ప్రజారోగ్య పారిశుధ్య కార్మికుల సేవలే ప్రశంసనీయంగా ఉంటాయి.

ప్రజారోగ్య విభాగానిదే కీలక పాత్ర



మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో జీడబ్ల్యూఎంసీలోని ప్రజారోగ్య విభాగానిదే కీలక పాత్ర. జాతర ప్రారంభానికి ముందు నుంచే ఈ విభాగం సేవలు ఆరంభమవుతాయి. పోస్టు జాతర సేవల్లో సైతం ప్రజారోగ్య విభాగ పాత్ర ఉంటుంది. ఈ ప్రాముఖ్యత మేరకు జీడబ్ల్యూఎంసీ కమిషనర్, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు ఇప్పటికే పలుమార్లు జాతరలో పారిశుధ్య, సేవలు, ప్రజారోగ్య విభాగం పాత్రపై పలు సమావేశాలు నిర్వహించి ప్రణాళికను రూపకల్పన చర్యలు చేపట్టారు.

550 మంది కార్మికులు

మేడారం జాతర కోసం జీడబ్ల్యూఎంసీ ప్రజారోగ్య విభాగం చర్యలు చేపట్టింది. ప్రస్తుతానికి 550 మంది పారిశుధ్య కార్మికులను జాతర కోసం తీసుకెళ్లాలనే నిర్ణయం జరిగింది. ఆ తదుపరి అవసరాల మేరకు కార్మికుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్ల అధికారులు చెబుతున్నారు. పారిశుధ్య కార్మికులతోపాటు జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు జాతర విధులు నిర్వహిస్తారు. జాతరలో 10 మంది కార్మికులకు ఒక జవాన్ ఉంటారు. మేడారాన్ని సెక్టార్లు విభజించి ఈ మేరకు కార్మికులకు విధుల కేటాయింపు జరుగుతుంది. సీఎంహెచ్‌వో డాక్టరు రాజేశ్ పర్యవేక్షణలో ప్రజారోగ్య సేవలు అందుతాయి.

30 స్వచ్ఛ ఆటోల కేటాయింపు

జాతర కోసం బల్దియా 30 స్వచ్ఛ ఆటోలను కేటాయించింది. అయితే వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త తరలింపు జరుగుతుంది. వాహనాలు మరమ్మతులకు గురైనా, మరిన్ని ఆటోలు అవసరమైనా వెంటనే సమకూర్చుకొనుటకు రిజర్వులో మరి కొన్ని స్వచ్ఛ ఆటోలను సిద్ధం ఉండేలా ప్రణాళికను రూపొందించారు.

50 ఏళ్ల లోపు ఎంపిక

జాతర విధులకు 50 ఏళ్ల వయస్సు లోపు కార్మికులనే ఎంపిక చేయాలనే నిర్ణయం జరిగింది. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా కొద్ది రోజుల కిందట ప్రజారోగ్య విభాగంతో జరిపిన సమీక్ష

మిగతా 8వ పేజీలో..

భారీగా పంచాయతీరాజ్

అధికారుల బదిలీలు

- సీఈవో, డిప్యూటీ సీఈవోలు, డీపీవోలకు స్థానచలనం

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

- వరంగల్ అర్బన్ పరిధిలో 13 మందికి స్థానచలనం, పోస్టింగ్‌లు

వివరాలు : 7లో..

మేడారం జాతర బస్ పాయింట్‌కు ఏర్పాట్లు



వరంగల్ ఆర్‌టీసి పాయింట్ ఏర్పాటుకు జరుగుతున్న పనులు

గిర్మాజిపేట, ఫిబ్రవరి 12 : ఈనెల 21 నుంచి ప్రారంభమయ్యే మేడారం జాతరకు వరంగల్ ఆర్టీసీ ప్రత్యేక బస్ పాయింట్ ఏర్పాటు కోసం అధికారులు పనులు ముమ్మరం చేశారు. వరంగల్‌లోని రైల్వేగూడ్స్ షెడ్ ముందు భాగంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్‌స్టేషన్‌ను మేడారం జాతర భక్తుల క్యూలైన్‌లుగా వినియోగించనున్నారు. క్యూలైన్‌ల ఏర్పాటు కోసం పనులు జరుగుతున్నాయి. నూతన బస్‌స్టేషన్ నిర్మాణం కోసం శుభ్రం చేసిన మునిసిపల్ స్థలంలో బస్‌ల రాకపోకల కోసం రోడ్డు వేస్తున్నారు. భారత్ పెట్రోలియం డిపో ఎదుట నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వైపు మేడారం బస్‌లు మినహా ఇతర వాహనాల రాకపోకలను నిషేధించాలని ఆర్టీసీ, పోలీసు అధికారులు సోమవారం నిర్ణయించారు. మేడారం బస్‌లు రామ్‌కీ ముందు నుంచి ఎస్ఎస్ఎం క్లబ్ పక్క నుంచి నేరుగా ఎస్ఎస్ఎం క్లబ్ ముందుకు చేరుకుంటాయి. అక్కడే క్యూలైన్‌ల నుంచి భక్తులు బస్‌లను ఎక్కుతారు. ఈ బస్‌లు వరంగల్ బస్‌స్టేషన్ ముందు మేడారం వెళ్తాయి. సోమవారం ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.రఘునాథరావు, వరంగల్ ప్రాంతీయ మేనేజర్ ఎం.శ్రీలత, డిప్యూటీ మేనేజర్ (ఆపరేషన్స్) భాను కిరణ్‌లు బస్ పాయింట్ ఏర్పాటు స్థలాన్ని సందర్శించి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వరంగల్ పాయింట్ నుంచి 450 బస్‌లను మేడారం నడపనున్నారు. ఈనెల 18 నుంచి మేడారం బస్‌లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారి తెలిపారు.

నేటి నుంచి ప్యాసింజర్ రైళ్ల పునరుద్ధరణ

డోర్నకల్, ఫిబ్రవరి 12: రోలింగ్ కారిడార్ బ్లాక్ వల్ల గతంలో రైల్వే అధికారులు రద్దు చేసిన కాజీపేట -డోర్నకల్ -విజయవాడ, విజయవాడ -డోర్నకల్ -కాజీపేట మధ్య నడిచే పుష్‌పుల్ ప్యాసింజర్ రైలు, విజయవాడ -డోర్నకల్-భద్రాచలం రోడ్, భద్రాచలం రోడ్-డోర్నకల్ -విజయవాడ స్టేషన్ల మధ్య నడిచే ప్యాసింజర్ రైళ్లను మంగళవారం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పునరు ద్ధరించిన రెండు ప్యాసింజర్ రైళ్ల ఈనెల 25వ తేదీ వరకు నడుస్తాయని తెలిపింది. సామాన్య ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల దృష్ట్యా రైల్వే ఉన్నతాధికారులు ప్యాసింజర్ రైళ్ల పునరుద్ధరణకు నిర్ణయం తీసుకోవడంతో డీఆర్ యూసీసీ మాజీ సభ్యుడు మైనూపాషా హర్షం వ్యక్తం చేశారు.

రైల్వేస్టేషన్ వైపు ట్రాఫిక్ తాత్కాలిక రద్దు

మేడారం ఆర్‌టీసి బస్‌ల పాయింట్ కోసం భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వరంగల్ రైల్వేస్టేషన్ వైపు సోమవారం రాత్రి నుంచి తాత్కాలికంగా రాకపోకలు నిలిపివేశారు. వరంగల్ చౌరస్తా నుంచి నేరుగా వరంగల్ రైల్వేస్టేషన్ లోపలికి వెళ్లేందుకు ఎలాంటి అడ్డంకులు లేవు. అయితే రైల్వేస్టేషన్ మీదుగా ఎస్ఎస్ఎం క్లబ్ ముందు నుంచి వెంకట్రామ జంక్షన్ వైపు, వరంగల్ చౌరస్తా నుంచి నేరుగా వరంగల్ ఆర్‌టీసి బస్‌స్టేషన్‌కు వెళ్లేందుకు మాత్రం రాకపోకలు నిలిపివేశారు. దీంతో బస్‌స్టేషన్ వైపు, ఎస్ఎస్‌క్లబ్ మీదుగా రామ్‌కీ వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వీరంతా గోవిందరాజుల గుట్ట ముందు నుంచి కూరగాయల మార్కెట్ బొడ్రాయి మీదుగా వెంకట్రామ జంక్షన్ పోవచ్చని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. మేడారం జాతర పూర్తి అయ్యే వరకు ఈ ట్రాఫిక్ నిషేదం కొనసాగుతుందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.



రైల్వేస్టేషన్ ముందు బారికేడ్‌ల ఏర్పాటు చేసిన దృశ్యం

ఇంటర్, టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 12: ఇంటర్మీడియేట్, పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, ఇందుకోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఇంటర్మీడియేట్ పరీక్ష 26 సెంటర్లలో ఫిబ్రవరి 28 నుంచి కొనసాగుతాయని 12,620 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు 54 సెంటర్లలో 9,455 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం బస్సులు ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులను తనిఖీ చేసి లోనికి పంపాలని ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరని పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది, తాగునీరు, విద్యుత్ అన్ని అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో ఇంటర్మీడియేట్ అధికారి మాధవరావు, విద్యాశాఖ అధికారి వాసంతి పాల్గొన్నారు.

ప్రజా వినతులు సకాలంలో పరిష్కరించాలి

- కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో కలెక్టర్ ప్రావీణ్య
- 53 దరఖాస్తుల స్వీకరణ



ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్


వరంగల్ కలెక్టరేట్, 12: కలెక్టరేట్ ప్రజావాణిలో ప్రజలు అందించిన వినతులను సకాలంలో పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా బాధితుల నుంచి 53 దరఖాస్తులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలంటే అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ పథకాలకు అర్హతలను బట్టి మంజూరి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లుగా తెలిపారు.

గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తుల్లో రెవెన్యూకు సంబంధించినవి 29, జీడబ్ల్యూఎంసీ 4, డీసీఎస్ 1, డీపీవో 2, డీఆర్‌డీఏ 1, సీపీ 1, ఎంప్లాయిమెంట్ శాఖకు 4, ఎంజీఎం 1, వ్యవసాయ శాఖ 1, ఎల్‌డీఎం 3, డీసీవో 1, మైనార్టీ వెల్ఫేర్ 1, పశుసంవర్ధక శాఖ 1, డీడబ్ల్యూవో 1, విద్యాశాఖ 2 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) అశ్విని తానాజీ వాకడే, ఆర్‌డీవో వాసుచంద్ర, డీఆర్‌డీఏ పీడీ సంపత్‌రావు పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

మట్టెవాడ, ఫిబ్రవరి 12:రామన్నపేట బట్టల బజార్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలను 13 నుంచి 18 వరకు బ్రహ్మో త్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వంశ పారం పర్య ధర్మకర్త పరాశరం శ్రీనివాసాచార్యులు, కార్యని ర్వాహణాధికారి ఎలపాటి రత్నాకర్ రెడ్డిలు తెలిపారు. 13న అలంకారం, శ్రీవిష్ణు స్తోత్రపారాయణం, ఉత్సవ ఆరంభ స్వప్నం, 14న రక్షా బంధనం, గరుడ హోమం, మూలమంత్ర అవనం, 15న సుదర్శ ననా ర సింహ షష్టి, హంస వాహన సేవ, హనుమత్ వాహన సేవ, 16న గరుడ వాహన సేవ, ఎదుర్కోళ్ల ఉత్సవం, గజవాహన సేవ, స్వామి తిరుకల్యాణ మహోత్సవం, 17న రథోత్సవ ఊరే గింపు, 18న మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, సాయంత్రం పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు.





పద్మాక్షికాలనీలో ఒకరిపై దాడి

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 12: హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధి పద్మాక్షికాలనీలో ఒకరిపై దాడి చేసిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మాక్షి కాలనీకి చెందిన బొంత వెంకటేశ్వర్లు, అతడి భార్య, కొడుకు రాజుతో కలిసి నివాసం ఉంటున్నారు. వారు ఇంటి సమస్యలపై గొడవ పడుతుండగా ఇంటి పక్కనే ఉన్న రాజు, ప్రకాశ్, నాగరాజు, ఉమ, రమ, సమ్మక్క అనే ఆరుగురు వ్యక్తులు కలుగ జేసుకుని ఇంటిపైకి వచ్చారు. వెంకటేశ్వర్లు కుమారుడు రాజుపై ఆరుగురు వ్యక్తులు మూకుమ్మడిగా దాడికి దిగారు. దీనిపై వెంకటేశ్వర్లు హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

గడ్డిమందు తాగి యువకుడి ఆత్మహత్య

ఐనవోలు, ఫిబ్రవరి 12: గడ్డిమందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వెంకటాపురంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సంగెం మండలం రాంచంద్రపురం గ్రామానికి చెందిన దౌతుబాజి అజయ్(22) ఇంటర్ చదివాడు. అమ్మమ్మ గ్రామమైన వెంకటాపురంలో నివసిస్తున్నాడు. ఏదైనా పనిచేసుకోవాలని కుటుంబసభ్యులు మందలించారు. దీంతో అజయ్ వారం కిందట గడ్డి నివారణ మందు తాగాడు. కుటుంబసభ్యులు గుర్తించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.

మహిళా ఉద్యోగికి వేధింపులు

రూ. 8 లక్షలు కాజేసిన కారుడ్రైవర్... కేసు నమోదు చేసిన పోలీసులు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 12: వరంగల్ జిల్లా నర్సంపేట ట్రెజరీ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగిని ఆమె కారు డ్రైవర్ డబ్బులు తీసుకుని మోసం చేశాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ న్యూరాయపురలో ఉంటున్న ఓ మహిళ.. నర్సంపేట ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. కుటుంబంలో విభేదాలు తలెత్తడంతో భర్తతో విడాకులు తీసుకుంది. హనుమకొండలో ఇద్దరు కుమారులతో నివాసం ఉంటోంది. కాగా, ములుగు జిల్లా బండారుపల్లి గ్రామానికి చెందిన బూజుగుండ్ల శివరాజ్ అనే వక్తి రెడ్డికాలనీలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో మహిళా ఉద్యోగితో ఫోన్‌లో పరిచయం చేసుకున్నాడు. తాను కారు డ్రైవర్‌గా పని చేస్తున్నానని నమ్మబలికాడు. ఈ మేరకు 2019లో మహిళా ఉద్యోగి ఒక కారు కొనుగోలు చేసి తాత్కాలిక డ్రైవర్‌గా శివరాజ్‌ను నియమించుకుంది. చాలాసార్లు ఆమె పిల్లల వద్దకు హైదరాబాద్‌కు తనతో తీసుకుని వెళ్లి వచ్చారు. ఆమె వద్దనే పర్మినెంట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆమెకు తన కుటుంబసభ్యులను సైతం పరిచయం చేశాడు.

కాగా, డబ్బులు అవసరం ఉన్నాయని మహిళ నుంచి రూ.8లక్షలు తీసుకున్నాడు. తర్వాత ఆమె సెల్‌ఫోన్ నుంచి పర్సనల్ ఫొటోలు తీసుకుని బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. డబ్బులు అడిగితే ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతానని ఫోన్ చేసి బెదిరించేవాడు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతోపాటు కారును కూడా ఇవ్వలేదు. ఇదేమిటని అడుగగా డబ్బులు, కారు అడిగితే చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో సదరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.













'కల్యాణ' వైభోగమే..

● పూర్తయిన వేయిస్తంభాల గుడి కల్యాణ మండపం పనులు ● ఈనెల 18న ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు



వేయిస్తంభాలగుడి కల్యాణ మండపానికి తుది మెరుగులు



పూర్తయిన మండపం పైకప్పు

హనుమకొండ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని చారిత్రకంగా సుప్రసిద్ధమైన కాకతీయుల కాలం నాటి శ్రీ రుద్రేశ్వర స్వామివారి వేయిస్తంభాల గుడి కల్యాణ మండపం పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. మండపం పైకప్పు పనులు దాదాపు పూర్తికావొచ్చాయి. ఈనెల 18వ తేదీన కల్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించాలని కేంద్ర పురావస్తు శాఖ అధికారులు ముహూర్తం నిర్ణయించారు. ఈప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా హాజరుకానున్నట్టు తెలుస్తోంది. వాస్తవానికి మండప ప్రారంత్సోవాన్ని మార్చి నెలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో నిర్వహించాలని మొదట నిర్ణయించారు. అయితే ఆలోగా లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉంది. దీనితో ఈ లోగానే మండపం పనులు పూర్తి చేసి ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. మండపం పనులను పరిశీలించేందుకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మంగళవారం వేయిస్తంభాల గుడికి వస్తున్నారు.

పూర్తయిన పైకప్పు

కల్యాణ మండపంపైన పైకప్పు పూర్తయింది. పలకలన్నిటినీ అమర్చారు. దక్షిణ ద్వారం వైపు మూడు పకలను అమర్చాల్సి ఉన్నది. వాటిని బుధ, గురువారాల్లో అమర్చితే మండపం పునర్నిర్మాణం పనులు పూర్తయినట్టే. మండపం పనుల త్వరితగతిన పూర్తికి స్థపతి బాలక్రిష్ణన్ శివకుమార్ నేతృత్వంలో తమిళనాడుకు చెందిన సుమారు 40మంది శిల్పులు రేయింబవళ్లు పని చేశారు. విద్యుత్‌లైట్ల వెలుగుల్లో అర్ధరాత్రి వరకు పనులు కొనసాగించారు. కేంద్ర పురావస్తుశాఖ సూపరింటెండెంట్ ఎస్. సుమితా కుమారి పర్యవేక్షణలో పురావస్తు ఇంజనీర్ క్రిష్ణచైతన్య, జిల్లా పురవాస్తుశాఖ అధికారి మల్లేశం దగ్గరుండి పనులు చేయించారు. ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండు రంగారావు సాంకేతిక సహాయాన్ని అందించారు.

ప్రమాదాన్ని పసిగట్టి

వేయిస్తంభాల గుడి కట్టడం చెక్కు చెదరలేదు కానీ దీనికి ఎదురుగా ఉన్న ఈ కల్యాణ మండపం మాత్రం శిథిలావస్థకు చేరుకున్నది. ఇందుకు కారణం దానికి కింది నుంచి ప్రవహించిన నీటి పాయగా గుర్తించారు. నీటి ప్రవాహం వల్ల పునాదిలో వాడిన ఇసుక తొలగిపోవడం వల్ల ఈశాన్య దిశగా రాతి స్తంభాలు కుంగి మండపం క్రమంగా పక్కకు ఒరిగి పోవడం మొదలుపెట్టింది. దీనిని అలాగే ఒదిలేస్తే మండపం ఎప్పుడైన కూలిపోయే ప్రమాదం ఉందని గుర్తించింది. ఒకవేళ అదే జరిగితే స్తంభాలన్నీ ముక్కలుగా విరిగి పోయి పునర్‌నిర్మాణం ఏమాత్రం సాధ్యం కాదు. దీంతో మండపం పడిపోక ముందే కేంద్ర పురావస్తు శాఖ 18 ఏళ్ల కిందట దీని పునర్నిర్మాణమనే మహాఘట్టానికి శ్రీకారం చుట్టింది. దిగితేకానీ లోతు తెలియదన్నట్లుగా పునర్నిర్మాణ పనులు చేపట్టిన తర్వాత అనేక అడ్డంకులు ఎదురయ్యాయి.

ఆగుతూ సాగుతూ..

మండపం పునర్నిర్మాణ పనులు ఇన్నాళ్లు అనేక అడ్డంకుల మధ్య ఆగుతూ సాగుతూ వచ్చాయి. మండపం పునర్మిణ పనులు 2006లో మొదలయ్యాయి. ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు చొరవతో ఒకవైపు కుంగిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్న మండపాన్ని మొదట ఎక్కడికక్కడ పూర్తిగా విప్పారు. వాటికి నెంబర్లు వేసి పద్మాక్షి గుడి సమీపంలో జాగ్రత్తగా భద్రపరిచారు. ఇసుక పునాదిని పూర్తి తొలగించి ఆ స్థానంలో మరో వెయ్యేళ్లపాటు కట్టడం నిలిచి ఉండేలా తిరిగి అదే రీతిలో ఇసుకతో (సాండ్ బాక్స్ టెక్నాలజీ) పునాదిని నిర్మించారు. బేస్‌మెంట్ పూర్తయిన తర్వాత 2010లో మండపాన్ని తిరిగి నిలబెట్టే పనులు మొదలయ్యాయి. 2017వరకు పనులు సజావుగానే సాగాయి. ఆ తర్వాత స్థపతికి బిల్లుల చెల్లింపులో జరిగిన జాప్యం వల్ల పనులు కుంటుపడ్డాయి. దాదాపు ఐదేళ్లపాటు అసలు పనులే జరగలేదు.

కేంద్రమంత్రి చొరవతో..

కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రిగా కిషన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మండపం పనుల్లో కదలిక వచ్చింది. గతంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్నపుడు వరంగల్‌కు వచ్చిన పలు సందర్భాల్లో ఈ మండపం పనుల పురోగతి గురించి ఆరా తీశారు. పనులు సత్వరం పూర్తయ్యేట్టు చూస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు మండపం పనులపై ప్రత్యేక దృష్టిసారించారు. స్థపతికి చేసిన పనులకు బిల్లుల చెల్లింపుల్లో ఏర్పడిన సమస్యను ఆయన పరిష్కరించారు. బిల్లుల చెల్లింపు జరిగేట్టు చూడడమే కాకుండా చివరి దశ పనుల పూర్తికి అవసరమైన రూ.5 కోట్ల నిధులను కూడా విడుదల చేయించారు. అలాగే మండపం మిగిలిపోయిన పనులను చిన్న చిన్న బిట్లుగా చేసి ఒక్కోదానికి ఇంత అని నిర్ణయించి నిధులు విడుదల చేయడం ద్వారా పూర్తి చేసేందుకు కేంద్ర పురావస్తుశాఖ ముందుకు వచ్చింది. ఆ మేరకు ఏడాది కిందట పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఐదు బిట్లకు నిధులు విడుదలయ్యాయి. దీనితో పనులు వేగం పుంజుకున్నాయి. కాగా, జనవరి నెలాఖరులోగా ఎట్టి పరిస్థితుల్లో పనులు పూర్తిచేయాలని, మార్చి నాటికి ప్రారంభోత్సవానికి మండపాన్ని సిద్ధంగా ఉంచాలని కిషన్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు కేంద్ర పురావస్తుశాఖ అధికారులు రంగంలోకి దిగి పనులు త్వరిత గతిన పూర్తయ్యేలా ప్రత్యక్ష పర్యవేక్షణ జరిపారు. ఎట్టకేలకు పనులు పూర్తయి మండపం పూర్వరూపాన్ని సంతరించుకున్నది.

నేడు కిషన్‌రెడ్డి రాక

పూర్తయిన వేయిస్తంభాలగుడి కల్యాణ మండపాన్ని పరిశీలించేందుకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి మంగళవారం వేయిస్తంభాల గుడికి వస్తున్నారు. మధ్యాహ్నం 1గంటలకు హనుమకొండ హంటర్‌రోడ్ విష్ణుప్రియ గార్డెన్స్‌కు ఎదురుగా బీజేపీ వరంగల్ పార్లమెంట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం ఇక్కడ మీడియాతో మాట్లాడతారు. మధ్యాహ్నం 3గంటలకు వేయిస్తంభాలగుడి కల్యాణ మండపాన్ని సందర్శించారు. పనుల పరిస్థితిని పరిశీలిస్తారు. సాయంత్రం 4 గంటలకు ఖిలా వరంగల్ కోటను సందర్శించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తారు.

భారీగా పంచాయతీరాజ్ అధికారుల బదిలీలు

సీఈవో, డిప్యూటీ సీఈవోలు, డీపీవోలకు స్థానచలనం

ఉమ్మడి జిల్లాలో 23మంది ఇతర ప్రాంతాలకు..

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 12: రాష్ట్రవ్యాప్తంగా జడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈవో, డీపీవో, డీఆర్‌డీవోలను 105 మందిని బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎన్నికల బదిలీల్లో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 23 అధికారులు స్థానచలనం చెందారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా శనివారం ఎంపీడీవోలను బదిలీ చేసిన పంచాయతీరాజ్ కమిషనర్.. సీఈవో, డిప్యూటీ సీఈవో, డీపీవో, డీఆర్‌డీవోలను బదిలీ చేశారు.

బదిలీలు ఇలా..

ఎం.విద్యాలత సీఈవో జడ్పీ భద్రాద్రి కొత్తగూడె జిల్లా నుంచి సీఈవో జడ్పీ హనుమకొండకు బదిలీపై వస్తున్నారు. ఎస్.వెంకటేశ్వర్‌రావు సీఈవో జడ్పీ హనుమకొండ నుంచి సీఈవో జడ్పీ ములుగు బదిలీ. ఎస్.ప్రసూనారాణి సీఈవో జడ్పీ ములుగు నుంచి సీఈవో జడ్పీ భద్రాద్రి కొత్తగూడెం బదిలీ. ఎ.శ్రీనివాస్‌కుమార్ డీఆర్‌డీవో హనుమకొండ నుంచి డీఆర్‌డీవో ములుగు బదిలీ. పి.నరేష్ డిప్యూటీ సీఈవో జగిత్యాల నుంచి డీఆర్‌డీవో జయశంకర్ భూపాలపల్లి బదిలీపై వస్తున్నారు. డి.పురుషోత్తం డీఆర్‌డీవో జయశంకర్ భూపాలపల్లి నుంచి డీఆర్‌డీవో మహబూబాబాద్ బదిలీ. ఆర్.సన్యాషయ్య డీఆర్‌డీవో మహబూబాబాద్ నుంచి డీఆర్‌డీవో ఖమ్మం బదిలీ. కె.నాగపద్మజ డీఆర్‌డీవో ములుగు నుంచి డీఆర్‌డీవో హనుమకొండకు బదిలీ. ఎం.సంపత్‌రావు డీఆర్‌డీవో వరంగల్ నుంచి డీఆర్‌డీవో జగిత్యాల బదిలీ. ఎన్.వసంత డిప్యూటీ సీఈవో జడ్పీ జనగామ నుంచి డిప్యూటీ సీఈవో జడ్పీ వికారాబాద్ బదిలీ. టి.పవన్‌కుమార్ డిప్యూటీ సీఈవో జడ్పీ కరీంగనర్ నుంచి డిప్యూటీ సీఈవో జడ్పీ వరంగల్ బదిలీపై వస్తున్నారు.

డి.సరిత డిప్యూటీ సీఈవో జడ్పీ మేడ్చల్ మల్కాజిగిరి నుంచి డిప్యూటీ సీఈవో జడ్పీ జనగామకు బదిలీపై వస్తున్నారు. బిసాహితి మిత్ర డిప్యూటీ సీఈవో జడ్పీ వరంగల్ నుంచి డిప్యూటీ సీఈవో జడ్పీ జయశంకర్ భూపాలపల్లి బదిలీ. ఎస్.వెంకట్ అడిషన్ పీడీ పశుసంవర్ధక శాఖ మహబూబాబాద్ నుంచి మాతృసంస్థ వ్యవసాయ శాఖకు బదిలీ అయ్యారు. పి.బాలక్రిష్ణ అడిషినల్ డీఆర్‌డీవో ములుగు నుంచి అడిషినల్ డీఆర్‌డీవో సిద్దిపేటకు బదిలీ. జె.కౌసల్యాదేవి అడిషనల్ డీఆర్‌డీవో సిద్దిపేట నుంచి డీఆర్‌డీవో వరంగల్ బదిలీపై వస్తున్నారు. ఆర్.స్టీఫెన్‌సీల్ అడిషినల్ డీఆర్‌డీవో వికారాబాద్ నుంచి అడిషినల్ డీఆర్‌డీవో ములుగు బదిలీపై వస్తున్నారు. ఎస్.వసుమతి అడిషినల్ డీఆర్‌డీవో వరంగల్ నుంచి అడిషినల్ డీఆర్‌డీవో జయశంకర్ భూపాలపల్లి బదిలీ. లక్కినేని లక్ష్మీరమాకాంత్ డీపీవో భద్రాద్రి కొత్తగూడెం నుంచి డీపీవో హనుమకొండ బదిలీపై వస్తున్నారు. వి.జగదీశ్వర్ డీపీవో హనుమకొండ నుంచి డీపీవో ములుగు బదిలీ. లత డీపీవో జయశంకర్ భూపాల్‌పల్లి నుంచి డీపీవో పెద్దపల్లి బదిలీ. కొండ వెంకయ్య డీపీవో ములుగు నుంచి డీపీవో మేడ్చల్ మల్కాజిగిరి బదిలీ. వి.నారాయణ రావు డీపీవో జయశంకర్ భూపాలపల్లి.

భారీగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

వరంగల్ అర్బన్ పరిధిలో 13 మందికి స్థానచలనం, పోస్టింగ్‌లు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 12: వరంగల్ అర్బన్ జిల్లాలో పని చేస్తున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనరేట్ ఇ.శ్రీధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొద్ది రోజుల్లో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ బదిలీలు జరుపుతున్నట్టు ఎక్సైజ్ ఉన్నతాధికారులు వెల్లడించారు. వరంగల్ అర్బన్ జిల్లాలో 3 ఎక్సైజ్ స్టేషన్లను కలుపుకుని 13 మందికి బదిలీలు, పోస్టింగ్‌లు ఇచ్చారు. అయితే ఎక్సైజ్ స్టేషన్‌లతోపాటు ఐఎంఎల్ లిక్కర్ డిపోలు, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ విభాగాల్లో ఎక్కువకాలం పని చేసిన వారికి బదిలీలు జరిగినట్టు ఎక్సైజ్ సిబ్బంది తెలిపారు. బదిలీ, పోస్టింగ్‌లు పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని ఎక్సైజ్ కమిషనర్ ఆదేశించారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ అయిన ప్రదేశం
జి. దుర్గాభవాని	హుజురాబాద్	హనుమకొండ
ఎస్. ప్రభాకరరెడ్డి	జగిత్యాల	వరంగల్ అర్బన్
కె. రాజు	ఖమ్మం-1	ఖిలావరంగల్
సీహెచ్‌ఎస్.ఆనంద్‌రావు	సుల్తానాబాద్	డీటీఎఫ్ వరంగల్ అర్బన్
ఎం. తిరుమలత	కరీంనగర్ రూరల్	ఐఎంఎల్ డిపో హనుమకొండ
సీహెచ్ నాగేశ్వర్‌రావు	డీటీఎఫ్ కొత్తగూడెం	ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్
కె. నాగయ్య	అశ్వరావుపేట	ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్
సీహెచ్ నీరజ	డీటీఎఫ్ వరంగల్ అర్బన్	డీటీఎఫ్ మహబూబాబాద్
బి. చంద్రమోహన్	ఖిలావరంగల్	ఖమ్మం -2
బి. కరుణశ్రీ	ఐఎంఎల్ డిపో హనుమకొండ	డీటీఎఫ్ ఖమ్మం
టి. శ్రీనివాసులు	ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్	హుజురాబాద్
ఎం. మాధవిలత	ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్	జమ్మికుంట
ఎల్. రామకృష్ణ	హనుమకొండ	చెక్‌పోస్టు నిజామాబాద్

మేడారంలో కొనసాగుతున్న మొక్కులు

ముందస్తుగా దర్శించుకున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 12: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు ముందస్తు మొక్కులు జోరుగా కొనసాగుతున్నాయి. మహాజాతరకు ముందుగానే తరలివస్తున్న భక్తులు తల్లుల గద్దెల వద్ద నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి యాట మొక్కులు చెల్లిస్తున్నారు. సోమవారం సుమారు 50 వేల మంది వనదేవతలను దర్శించుకున్నారని దేవాదాయశాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించుకున్నారు. శివసత్తు పూనకాల నడుమ వనదేవతలకు జేజేలు పలుకుతూ అమ్మవార్ల గద్దెలకు చేరుకున్నారు. తల్లులను తాకి వడిబియ్యం పోసి పసుపు కుంకుమ, పూలు, పండ్లు, చీరెలు, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చల్లంగా చూడాలని వేడుకున్నారు.



మేడారంలో వనదేవతల గద్దెలను దర్శించుకుంటున్న భక్తులు

భక్తులకు తాగునీటి కష్టాలు

వనదేవతలకు ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి సోమవారం మేడారం తరలివచ్చిన భక్తులకు తాగుగునీటి కష్టాలు తప్పలేదు. తీవ్రఎండలో క్యూలైన్ల ద్వారా తల్లులను దర్శించుకున్న సందర్భంలో దాహంతో అల్లాడాల్సి వచ్చింది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వచ్చింది. వారి అవస్థలు చూసే వారే అక్కడ కరువయ్యారు.

వెడేక్కి చల్లబడి..

మేడారం మహాజాతర సందర్భంగా పరిసరాల్లో వెలిసిన దుకాణాల్లో శీతల పానీయాలు అమ్ముతున్నారు. వివిధ కంపెనీల కూల్‌డ్రింక్స్ లభ్యమవుతున్నాయి. అయితే.. ఆయా కంపెనీల డీలర్లు స్టాకును ఎండలోనే ఉంచుతున్నారు. రెండు మూడు రోజులపాటు ఎండలో ఉన్న కూల్‌డ్రింక్స్‌ను ఫ్రిజుల్లో చల్లబరిచి భక్తులకు విక్రయిస్తున్నారు. శీతల పానీయాలను ఎండలో ఉండటం ఆరోగ్యానికి అంతగా మంచిది కాదని నిపుణులు అంటున్నారు.



గద్దెల పరిసరాల్లో రద్దీ

గుడారాల మేడారం



మేడారం మహాజాతర సందర్భంగా ని చిరు వ్యాపారులు గుడారాలు వేసి దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 21 నుంచి నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా జాతర జరగనుండగా మొక్కులు చెల్లించుకునేందు కోటిన్నరకు పైగా భక్తులు మేడారం తరలివస్తారని అధికారులు అంచనా వేశారు. దీంతో వ్యాపారాలు జోరందుకోనున్నాయి. అలాగే భక్తులకు ప్రభుత్వం సకల సౌకర్యాలను ఏర్పాటు చేసింది. వారికి వేలాది మంది అధికారులు సేవలు అందించనున్నారు.

లోపించిన పారిశుధ్యం



మేడారంలో పారుశుధ్యం లోపించింది. దీంతో అక్కడి పరిసరాలు దుర్వాస వెదజల్లుతున్నాయి. ఆదివారం 10 లక్షలకు పైగా భక్తులు రాగా వారి వదిలిన వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు పూర్తిస్థాయిలు తొలగించలేక పోయారు. ఈ క్రమంలో సోమవారం గద్దెల పరిసర ప్రాంతాల్లో దుర్వాతస వెదజల్లింది. దీనిపై భక్తులు, స్థానికులు డీపీవో వెంకయ్యకు ఫిర్యాదు చేశారు.



సద్దిమడుగులోకి ప్రవహిస్తున్న నీటిని పరిశీలిస్తున్న ఐబీ అధికారులు

మేడారానికి లక్నవరం నీటి విడుదల

సద్దిమడుగులోకి మొదలైన ప్రవాహం

రెండు రోజుల్లో జంపన్నవాగులోకి మళ్లింపు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 12: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు వచ్చే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకోసం మండలంలోని ప్రఖ్యాత లక్నవరం సరస్సు నుంచి జలాలను సోమవారం నీటిపారుదల శాఖ అధికారులు విడుదల చేశారు. ఈఈ శ్రీనివాస ఆధ్వర్యంలో సిబ్బంది తూములను ఎత్తారు. తొలుత నీటిని సమీపంలోని సద్దిమడులోకి తరలిస్తున్నారు. రెండు రోజుల తర్వాత దయ్యాలవాగు మీదుగా జంపన్నవాగులోకి ప్రవాహాన్ని మళ్లిస్తామని ఈఈ తెలిపారు. ప్రస్తుతం జంపన్న వాగులో నీటి ప్రవాహం లేకపోవడంతో భక్తులు బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కిందనే పుణ్యస్నానాలు చేస్తున్నారు. పుణ్య జంపన్న వాగు నీటిలో తలారా స్నానం చేయడాన్ని సెంటిమెంట్‌గా భావించే భక్తులు ప్రవాహం లేకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. మహాజాతరకు ఎనిమిది రోజుల గడువు మాత్రమే ఉండగా ఇప్పటికే నిత్యం లక్షలాది మంది వనదేవతల దర్శనానికి తరలివస్తున్నారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ ఎన్నడూ లేని విధంగా ఈసారి ఎనిమిది రోజుల ముందుగానే లక్నవరం నుంచి అధికారులు నీటిని విడుదల చేశారు.

సీఐల బదిలీల్లో గందరగోళం

పరకాల సీఐగా వెళ్లిన అబ్బయ్య వీఆర్‌కు అటాచ్

ఇప్పటికే కేయూ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ నియామకం నిలిపివేత

హనుమకొండ, ఫిబ్రవరి 12: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ల పోస్టింగ్‌లు మూన్నాళ్ల ముచ్చటగానే మారుతోంది. పోస్టింగ్ పొందిన కొందరు అధికారులు డ్యూటీలో జాయిన్ కాకుండానే వెనక్కి పంపిస్తున్నారు. సీఐల పోస్టింగ్ నేడు పోస్టింగ్.. రేపు ఊస్టింగ్.. అనే పరిస్థితిలో ఉంది. ప్రధానంగా గతంలో పనిచేసిన పోలీసుస్టేషన్‌లలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులకు మాత్రమే పోస్టింగ్‌లలో ఈ మార్పు జరుగుతోందని, మిగతా వారికి ఇబ్బంది లేదని పోలీసు అధికారులు చెప్పుకొస్తున్నారు. కాగా, ఇటీవల జరిగిన బదిలీల్లో కేయూ నుంచి పరకాలకు పోస్టింగ్‌పై వెళ్లిన ఎం. అబ్బయ్యకు పోస్టింగ్ ఇచ్చినట్టే ఇచ్చి ఆర్డర్‌ను రద్దు చేశారు. విధుల్లో చేరి రెండు రోజులు గడవక ముందే సీపీకి (వీఆర్) అటాచ్ చేయడం వివాదాస్పదంగా మారింది. పరకాలకు ఇంకా ఎవరిని నియమించలేదు. అదే విధంగా ఖమ్మం నుంచి కేయూ పీఎస్‌కు పోస్టింగ్ ఇచ్చిన శ్రీధర్‌కు ఇచ్చినట్టే ఇచ్చి కొన్ని అనివార్య కారణాల వల్ల పోస్టింగ్ నిలిపి వేశారు. కేయూకు గతంలో ఏనుమాములలో పని చేసిన చేరాలును నియమించే అవకాశాలు ఉన్నాయి. అయితే పరకాలకు, కేయూకు ఒకటి, రెండు రోజుల్లో ఇన్‌స్పెక్టర్లను సీపీ నియమించనున్నారు. అలాగే ఇటీవల ములుగు నుంచి వరంగల్ కమిషనరేట్‌కు వచ్చిన మరో వివాదాస్పద ఇన్‌స్పెక్టర్‌ను కూడా వెనక్కి పంపించే అవకాశాలు మెండుగా ఉన్నాయనే పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.

లూప్‌లైన్ లేకుండా పోస్టింగ్‌లు

ప్రస్తుతం వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇన్‌స్పెక్టర్లుగా పోస్టింగ్‌లు పొందిన వారు లూప్‌లైన్‌లో పనిచేయకుండానే పోస్టింగ్ కొట్టేయడం కొందరు సీనియర్ అధికారులకు మింగుడుపడడం లేదు. ఒక పోలీసు అధికారి ఎస్‌ఐ నుంచి ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన తర్వాత కనీసం 3 యేళ్లపాటు లూప్‌లైన్‌లో పని చేసి ఉండాలి. కానీ ప్రజాప్రతినిధుల వద్ద సిఫారసు లేఖలు తెచ్చుకుని పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నట్టు తెలుస్తోంది.

మేడారం జాతరకు ఉత్సవ కమిటీ

● ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం ● చైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్



అర్రెం లచ్చుపటేల్

ములుగు, ఫిబ్రవరి 12: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు ఉత్సవ కమిటీని ఏర్పాటుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. చైర్మన్‌గా తాడ్వాయి మండలకేంద్రానికి చెందిన అర్రెం లచ్చుపటేల్ నియమితులయ్యారు. జాతరకు ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ చైర్మన్ సహా 14మంది సభ్యులతో కూడిన జాబితాను ఇటీవల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క దేవాదాయ శాఖకు సిఫారసు చేశారు. పరిశీలించిన అధికారులు అదే జాబితాతో కమిటీని ప్రకటించారు. ఈనెల 12నుంచి 25వ తేదీ వరకు కాలపరిమితితో పని చేసే ఈ ఉత్సవ కమిటీకి చైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్ వ్యవహరించనుండగా డైరెక్టర్‌లుగా మిలుకూరి అయిలయ్య, కొండి గోపాల్, గంగెర్ల రాజారత్నం, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, యాప అశోక్, పోరిక నారాయణసింగ్, ముంజాల భిక్షపతి, సుంచు హైమావతి, చామర్తి కిశోర్, ఆలం శశిధర్, వద్దిరాజు రవిచంద్ర, అంకం కృష్ణస్వామి, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు వ్యవహరించనున్నారు.

ఈ నూతన ఉత్సవకమిటీ ఒకట్రెండు రోజుల్లో పదవీ ప్రమాణం చేసే అవకాశముంది. కాగా, తనను మేడారం జాతర ఉత్సవ కమిటీ చైర్మన్‌గా నియమించడంపై అర్రెం లచ్చుపటేల్ మంత్రులు సీతక్క, కొండా సురేఖలకు కృతజ్ఞతలు తెలిపారు. జాతరను విజయవంతం చేస్తామని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.

అమాయక ప్రాణాలకు 'ఉచ్చు'

● విద్యుత్ ఉచ్చుకు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బలి ● భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో విషాదం

కాటారం/గోవిందరావుపేట, ఫిబ్రవరి 12: వన్యప్రాణులను సంహరించేందుకు వేటగాళ్లు బిగించిన విద్యుత్ ఉచ్చుకు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బలయ్యారు. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేస్తుండగా విద్యుత్ ప్రసరణ జరిగే ఉచ్చు తగిలి గ్రేహౌండ్స్ జూనియర్ కమాండో బలయ్యాడు. అలాగే ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని దుంపెల్లిగూడెంలో తప్పిపోయిన గొర్రెలను వెతుకుతుండగా ఉచ్చు తగిలి ఓ వ్యక్తి మరణించాడు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి.

కూంబింగ్ చేస్తుండగా..



ప్రవీణ్ మృతదేహం

భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో మేడిగడ్డ బ్యారేజీని సందర్శించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ సభ్యులు, పలువురు ఎమ్మెల్యేలు మంగళవారం పర్యటించనున్న నేపథ్యంలో కాటారం శివారు అటవీప్రాంతంలో 30 మందితో కూడిన గ్రేహౌండ్స్ బలగాలు ఆదివారం రాత్రి కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని రాజోలుగూడకు చెందిన 2012 బ్యాచ్ గ్రేహౌండ్స్ జూనియర్ కమాండర్ ఆడే ప్రవీణ్ (34)తో పాటు పలువురు గ్రేహౌండ్స్ కమాండోలు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో భూమికి రెండు ఫీట్ల ఎత్తులో సెంట్రింగ్ వైర్‌తో విద్యుత్ సరఫరా అయ్యేలా వన్యప్రాణుల కోసం వేటగాళ్లు తీగలను అమర్చి ఉన్నారు. అవి తగిలి ప్రవీణ్ షాక్‌కు గురై అపస్మారకస్థితికి వెళ్లారు. చేతిపై వైరు లోతుగా దిగింది. దీంతో తోటి కానిస్టేబుల్స్ తమ ఉన్నతాధికారులతోపాటు స్థానిక పోలీస్ అధికారులకు ఈ సమాచారాన్ని చేరవేశారు. స్థానిక సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి హుటాహుటిన బయల్దేరారు. అటవీ ప్రాంతం కాగా వాహనాలు అందుబాటులో లేకపోవడంతో అప్పటికే గ్రేహౌండ్స్ కమాండోలు ప్రవీణ్‌ను చేతులపై ఎత్తుకొని కొద్ది దూరం మోసుకొచ్చారు. అనంతరం 108 అంబులెన్స్ చేరగా అందులో తరలిస్తుండగానే ప్రవీణ్ మృతి చెందారు. మృతడికి భార్య లత, కుమారులు హర్ష, వివాన్ ఉన్నారు. గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

గొర్రెలను వెతుకుతుండగా

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని దుంపెల్లిగూడెం గ్రామానికి చెందిన మాదారపు అనిల్‌కు సంబంధించిన గొర్రెలు ఆదివారం రాత్రి మంద నుంచి తప్పిపోయాయి. వాటిని వెతికేందుకు తన మిత్రుడు పిండి రమేష్ (28)తో కలిసి రాత్రి 11గంటల సమయంలో సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లారు. ముందుగా నడుస్తున్న రమేష్ అటవీ జంతువులను వేటాడేందుకు గుర్తుతెలియని వ్యక్తులు అమర్చిన విద్యుత్ ఉచ్చు తగిలి షాక్‌కు గురయ్యాడు. దీంతో వెనక వస్తున్న అనిల్ అప్రమత్తమయ్యాడు. చీకటిగా ఉండటంతో కాపాడే ప్రయత్నం చేసినా అప్పటికే రమేష్ మృతిచెందాడు. అనిల్ ఇచ్చిన సమాచారంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఘటనా స్థలికి చేరుకొని విగతజీవిగా పడి ఉన్న రమేష్‌ను చూసి బోరున విలపించారు. రమేష్‌కు ఆరు నెలల కిందటే వివాహమైంది. భర్త అకాల మరణంతో ఆయన భార్య అఖిల గుండెలవిసేలా రోదించింది. మృతుడి తండ్రి సాంబయ్య ఫిర్యాదు మేరకు పస్రా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రమేష్ మృతదేహం





ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన కిషన్

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 12: ఏనుమాముల పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా పి.కిషన్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన ఎస్‌హెచ్‌వో మహేందర్ బదిలీపై వెళ్లగా దుగ్గొండి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా పనిచేసిన కిషన్ ఏనుమాములకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే ఏనుమాముల ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కిషన్ మాట్లాడుతూ.. భూ మాఫియా, రౌడీయిజంపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.


డబ్ల్యూపీసీలో మార్కండేయ చిత్రపటానికి పూలమాలవేస్తున్న మల్లేశం

వైభవంగా మార్కండేయ జయంతి

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 12: పద్మశాలీల వంశ మూల పురుషుడు మార్కండేయుడి జయంతిని పద్మశాలీలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. వరల్డ్ పద్మశాలీ క్లబ్ ప్రాంగణంలో మార్కండేయ చిత్రపటానికి పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఈగ మల్లేశం నూలు పోగులతో తయారు చేసిన దండలను వేసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఇటీవల మృతిచెందిన రాష్ట్ర పద్మశాలీ ప్రముఖులు రామా శ్రీనివాస్, మచ్చ ప్రభాకర్‌రావులకు నివాళులర్పించిన వారి ఆశయాలను కొనసాగిస్తామని మల్లేషం అన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, డబ్ల్యూపీసీ సభ్యులు కూరపాటి సుదర్శన్, మంతెన రమేష్, మార్గం కుమారస్వామి, బేతి అశోక్ బాబు, చందా మల్లయ్య, దుస్స శివశంకర్, అశోక్, చిప్ప వెంకటేశ్వర్లు, వడిచర్ల భాస్కర్, ప్రసాద్, బిట్ల సమ్మయ్య పాల్గొన్నారు.

» ఖిలావరంగల్: పద్మశాలీల వంశ మూల పురుషుడు మార్కండేయుడని, చూపిన మార్గంలో పద్మశాలీలు పయనించాలని పోపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ కోరారు. సోమవారం శివనగర్‌లోని పద్మశాలి కళ్యాణమండపంలో మార్కండేయ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోపా, పద్మశాలీ నాయకులు ధర్మపురి రాజగోవిందు, మాటేటి అశోక్‌కుమార్, గజ్జెల లింగమూర్తి, అంకం సత్యం, సింగం కుమార్, వెంకన్న, కిరణ్, రాజు, షైనర్ బాబు, కృష్ణ, శ్రీధర్ పాల్గొన్నారు.

» వరంగల్‌టౌన్: కాశిబుగ్గ భక్త మార్కండేయ దేవాలయంలో సోమవారం భక్త మార్కండేయ జయంతిని పురస్కరించుకుని కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మృత్యుంజయ, గాయత్రి హోమం నిర్వహించారు. అనంతరం మహాఅన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గుండు చంద్రమౌళి, సబ్బని శంకర్, రాజ్‌కుమార్, గుత్తికొండ నవీన్, మార్త ఆంజనేయులు, రామ నవీన్, ఆడెపు సాగర్, క్యాతం శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎల్బీనగర్ పద్మశాలి ట్రస్టు భవన్‌లో పద్మశాలి సేవా సంఘం ట్రస్టు అధ్యక్షుడు సుంకనపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా భక్తమార్కండేయ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో గోరంటాల రాజు, గోసికొండ సుధాకర్, ఆకెన వెంకటేశ్వర్లు, గాదె ప్రభాకర్, బైరి సారంగపాణి, బైరి మురళీకృష్ణ, ఎల్లయ్య పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాణించిన విద్యార్థులు



విద్యార్థులకు ప్రశంసాపత్రం ఇస్తున్న హెచ్‌ఎం

ఖిలావరంగల్, ఫిబ్రవరి 12: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనపరిచి ద్వితీయ స్థానం పొందిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు కట్రాజు వెంకటయ్యఅభినందించారు. సోమవారం మధ్యకోటలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులను మెమెంటో, సర్టిఫికెట్స్ ఇచ్చి అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఈనెల 9, 10, 11 తేదీల్లో ధర్మసాగర్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో యశ్వంత్(9వ తరగతి), ముజఫర్(టెన్త్)లు రాణించడం ఈ ప్రాంతానికి గర్వకారణమన్నారు. విద్యార్థులతోపాటు, పీఈటీ సృజనను అభినందించారు.

ఘనంగా బొడ్రాయి వేడుకలు


మట్టిపాత్రలను యాగశాలలో సమర్పించిన శాలివాహనులు

శంభునిపేట, ఫిబ్రవరి 12: రంగశాయిపేటలో బొడ్రాయి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారంవేద పండితులు వెలిదె భార్గవ శర్మ, ప్రదీప్ శాస్త్రిల చేతుల మీదుగా మహంకాళీ ఆలయ ప్రాంగణంలో పతిష్ఠతుద్వ పూర్వక యాగచండీ మహాయాగం నిర్వహించారు. మహంకాళీ ఆలయం నుంచి నెర్రహా విగ్రహం వద్ద గల బొడ్రాయి గద్దె చుట్టూ, రామాలయం వద్ద గల బొడ్రాయి గద్దె చుట్టూ పెద్ద సంఖ్యలో హోమ మండపాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుండి సుమారు 6వేల మంది హోమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం నుంచి జలాదివాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతల విగ్రహాలకు జలాభిషేకం చేసేందుకు తమ ఇళ్ల నుంచి రాగి పాత్రలలో నీటిని తీసుకువచ్చారు. పూజల్లో గ్రేటర్ మేయర్ గుండు సుధారాణి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుండు చందన, ఉత్సవ కన్వీనర్లు కొల్లూరి యోగానంద్, కేడల పద్మజనార్దన్, గుండు పూర్ణచందర్ పాల్గొన్నారు.

ఉత్సవాలకు మట్టిపాత్రల సమర్పణ

గ్రామదేవత, భూలక్ష్మీ, శ్రీలక్ష్మీ (బొడ్రాయి)ప్రతిష్ఠ యాగ మహోత్సవం సోమవారం గ్రామదేవతల పూజారులైన శాలివాహను(కుమ్మరులు)లు తమ పూజలకు మట్టి పాత్రలను సమర్పించారు. బొడ్రాయి ఉత్సవాల్లో నిర్వహించే పూజల కోసం శాలివాహన సంఘం ఆధ్వర్యంలో 650 మట్టి కుండలను ప్రత్యేకంగా తయారు చేశారు. మట్టి పాత్రలను శోభాయాత్రను యాగశాలకు తీసుకొచ్చారు. కులపెద్దలు ఆవునూరి రవి, ఆవునూరి కుమారస్వామి మాట్లాడుతూ బొడ్రాయికి సమర్పించే తొలి నైవేద్యం (తొలి బోనం) కుమ్మరులదే కావడం తమ కులానికి దక్కిన గౌరవంగా భావిస్తామన్నారు.

కరీమాబాద్, రంగశాయిపేటలో ఉప్పొంగిన భక్తిభావం

కరీమాబాద్‌లో సందడి..

కరీమాబాద్: అండర్ రైల్వేగేటు ప్రాంతం కరీమాబాద్‌లో బొమ్మలగుడి వద్ద చేపడుతున్న భూలక్ష్మీ, శ్రీలక్ష్మీ గ్రామదేవత బొడ్రాయి పునఃప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బొమ్మలగుడి ప్రాంతంలో ఏర్పాటు చేసిన యాగశాల ఏర్పాటు చేశారు. 12 నుంచి 14 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ వేడుకల్లో సోమవారం హోమాలు, సాయంత్రం జలదివాసం నిర్వహించారు. 13న అభిషేకాలు, కుంకుమార్చనలు, ధాన్యాదివాసం, 14న యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, అన్నదానం, రాత్రి సమయంలో బలిచల్లుట, వంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.


రంగశాయిపేట హోమంలో పాల్గొన్న మేయర్ సుధారాణికి సన్మానం


కరీమాబాద్‌లో పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్న బ్రాహ్మణులు

చలువ పందిళ్ల ఏర్పాటు...

ఉత్సవాల సందర్భంగా కరీమాబద్ బొమ్మలగుడి ప్రాంతంలో ప్రధాన రహదారిని కలుపుకొని నలువైపులా వీధుల్లో చలువ పందిళ్లు వేసి, కాషాయ జెండాలను కట్టారు. విద్యుత్ వెలుగుల్లో పరిసరాలు ధగధగలాడుతున్నాయి. ప్రత్యేక పూజలతో కరీమాబాద్ ప్రాంతం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. సుమారు 5వేల మంది జంటలుగా యాగాది కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. బొడ్రాయి ఉత్సవాల సందర్భంగా పలు ప్రాంతాల్లో స్థిరపడిన వారు తమ పుట్టిన ఊరిలో బొడ్రాయి ఉత్సవాల సందర్భంగా స్వగ్రామానికి రావడం, ఆడపడుచుల రాకతో ప్రతి ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. ఏ ఇంట్లో చూసిన సందడే సందడి కనిపిస్తుంది. భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో పూజాదికాలు నిర్వహించనున్నారు. మంగళవారం గ్రామోత్సవం, హోమం, విగ్రహాల ఊరేగింపు, కుంకుమార్చన, బుధవారం యంత్ర స్థాపన, విగ్రహస్థాపన, పూర్ణాహుతి, బలిచల్లుట, పొలిపోయుట కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

'హరితహారం' లక్ష్యాన్ని పూర్తి చేయాలి: కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 12: జిల్లాలో హరితహారంలో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో హరితహారం అమలుపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2023లో లక్ష్యం మేరకు 25.95 లక్షల మొక్కలు నాటడం జరిగిందని, 2024లో 25.85 లక్షల మొక్కలను నాటడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. జిల్లాలోని సంబంధిత శాఖలకు కేటాయించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటేందుకు స్థలాల గుర్తింపు గుంతల తవ్వకం చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ వాకడే, అటవీశాఖాధికారి అర్చన, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సంపత్‌రావు, జిల్లా పంచాయతీ శాఖ అధికారి కల్పన పాల్గొన్నారు.


హరితహారం సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కేంద్ర పథకాలపై పరిశీలన..

కేంద్ర ప్రభుత్వ పథకాలు జిల్లాలో అమలు జరుగుతున్న తీరుపై ఈనెల 6 నుంచి 13 వరకు రెండు బృందాలు క్షేత్రస్థాయిలో జిల్లాలో పర్యటించి అభివృద్ధి పథకాల తీరుతెన్నులను పరిశీలించారు. అనంతరం సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్యతో సమావేశమై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సెక్షన్ అధికారులు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలులో ఆదర్శంగా ఉందన్నారు. అనంతరం 16 మంది కేంద్ర ప్రభుత్వ సెక్షన్‌కు చెందిన హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థకు చెందిన వారు కలెక్టర్‌తో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ సంపత్ రావు, జిల్లాయూనిట్ మేనేజర్‌కుమారస్వామి పాల్గొన్నారు.

జర్నలిస్టు యూనియన్ డైరీ అందజేత

ఇండియన్ జర్నలిస్టు టీయూడబ్ల్యూజే ఐజేయూ నూతన సంవత్సర 2024 డైరీని సోమవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు రాష్ట్ర కార్యదర్శి గాడిపెల్లి మధు అందజేశారు. కార్యక్రమంలో ఐజేయూ జిల్లా అధ్యక్షుడు శ్రీరాం రాంచందర్, జిల్లా కోశాధికారి వడిచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సేవకు సిద్ధం

5వ పేజీ తరువాయి

సమావేశంలో అధికారులకు ఈ విషయాన్ని స్పష్టం చేశారు.40ఏళ్ల లోపు వయస్సు ఉన్న కార్మికులను ఎంపిక చేసేందుకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అంతేకాకుండా కార్మికుల ఆరోగ్య పరిస్థితులు, గత జాతరల్లో విధులు నిర్వహించిన వారి అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజారోగ్య అధికారులు

మేడారంజాతరలో పారిశుధ్య కార్మికుల విధుల నిర్వహణ, కార్మికులకు వసతి ఇతరత్రా సౌకర్యాల ఏర్పాటు తదితర అంశాల పరిశీలన కోసం జీడబ్ల్యూఎంసీ ప్రజారోగ్య అధికారులు ఒకటి రెండు రోజుల్లో మేడారం వెళ్లనున్నారు. జాతర ప్రారంభానికి ముందుగానే అధికారులు, కార్మికుల సేవలు ఆరంభమవుతాయి. ఇప్పటికే భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో ఈ సారి పారిశుధ్య సేవలు విస్తృతం అవుతాయనే అంచనాల్లో అధికారులు ఉన్నారు. పోస్టు జాతర సేవలను దృష్టిలో ఉంచుకొని పారిశుధ్య కార్మికులు 25వ తేదీ వరకు మేడారంలోనే ఉంటారు.

కార్మికులను సిద్ధం చేస్తున్నాం
- సీఎంహెచ్‌వో రాజేశ్



మేడారం జాతర కోసం కార్మికులను సిద్ధం చేస్తున్నాం. ఈ మేరకు సమావేశాలు ఇప్పటికే నిర్వహించాం. మరిన్ని సమావేశాల నిర్వహణతో కార్మికులను సంసిద్ధులను చేసే ప్రణాళికతో ఉన్నాం. ముఖ్యంగా కార్మికుల ఎంపికలో వారి ఆరోగ్య పరిస్థితిని ప్రధానంగా తీసుకుంటున్నాం. వాహనాలు సిద్ధం చేసుకున్నాం. జాతరలో కార్మికులకు వసతి, భోజన సౌకర్యం, మహిళలకు ప్రత్యేకంగా వసతుల కల్పన తదితర అంశాలను పరిశీలించేందుకు ఒకటి రెండు రోజుల్లో మేడారానికి వెళ్లనున్నాం.

పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వద్దు..

ఇన్‌చార్జి కమిషనర్ రాధికాగుప్త

మట్టెవాడ, ఫిబ్రవరి 12: పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం చేయవద్దని, తాగునీటి సరఫరా పకడ్బం దీగా జరగాలని గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ రాధిక గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం 18, 27, 28 డివిజన్లలో పారిశుధ్య పనులను తాగునీటి సరఫరా తీరును క్షేత్రస్థాయిలో రాధికగుప్తా ప్రజా ఆరోగ్య, ఇంజనీరింగ్, వాటర్ సప్లై అధికారులతో కలిసి పరిశీలించారు. అపరిశుభ్ర వాతావరణంలో దుకాణాలు నిర్మిస్తున్న యజమానులకు జరిమానా విధించాలని అధికారులను రాధిక గుప్తా ఆదేశించారు. గోవిందరాజుల గుట్ట ప్రాంతం, గిర్మాజీపేట, అబ్బనికుంట, తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరంగల్ చౌరస్తా, రామన్నపేట, ఓల్డ్ బీట్ బజార్, అండర్ రైల్వే బ్రిడ్జి, స్టేషన్ రోడ్డు, వరంగల్ బస్టాండ్ రోడ్డు, పోస్టాఫీస్ జంక్షన్, జేపీఎన్ రోడ్డులో పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, ఈఈ శ్రీనివాస్, డీఈలు సారంగం, రవికుమార్, ఏఈలు సతీష్, అబీబ్, సౌజన్య, శానిటరి ఇన్‌స్పెక్టర్లు మాదాసు సాంబయ్య, సంపత్‌రెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.


వరంగల్‌లో పారిశుధ్య పనులను తనిఖీ చేస్తున్న అధికారులు

ఐటీడీఏ పీవో బదిలీ


చిత్రామిశ్రా

ములుగు, ఫిబ్రవరి 12: ఏటూరు నాగారం ఐటీడీఏ పీవో అంకిత్ బదిలీ అయ్యారు. నిజామాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన స్థానంలో నిజామాబాద్ అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న చిత్రామిశ్రాను నియమించింది. వీరిద్దరూ 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. 2022 జూన్ 13న ఏటూరునాగారం ఐటీడీఏ పీవోగా బాధ్యతలు స్వీకరించిన అంకిత్‌సమర్థవంత అధికారిగా మన్ననలు పొందారు. గోదావరి వరదల సమయంలో సహాయక చర్యలను చేపట్టడంలో కృషిచేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ములుగు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. మేడారం మహాజాతర కోసం ఐటీడీఏ ద్వారా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తూ చాలా వరకు పనులను ఇప్పటికే పూర్తిచేయించారు.


సంగెంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

సంగెం, ఫిబ్రవరి 12: సంగెం మండల కేంద్రంలో మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నేతలు సోమవారం దహనం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసిన అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి అసెంబ్లీకి రాకుండా ప్రభుత్వంపై నిరంతరం అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ప్రభుత్వాన్ని అబాసుపాలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ మేరకు కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంటు రమేష్, మండల మండల కిసాన్‌సెల్ అధ్యక్షుడు అచ్చ నాగరాజు, గవిచర్ల గ్రామ ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, సంగెం సొసైటీ డైరెక్టర్ జనగాం రమేష్,, చింతలపల్లి మాజీ సర్పంచ్ ఇండ్ల రవికుమార్, నాయకులు మడ్డ కేశవులు, గుండేటి ఎల్లయ్య, బాసిపాక సదయ్య, ఎనబోతుల సదయ్య, గాలి చేరాలు, గుండేటి రాజేష్, చెవ్వ మొగిలి, ప్రభాకర్ పాల్గొన్నారు.

16న సమ్మెను సక్సెస్ చేయాలి

మట్టెవాడ, ఫిబ్రవరి 12: ఈనెల 16న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ప్రజల్ని ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు కోరారు. సోమవారం వరంగల్ ఏసీపీ బోనాల కిషన్‌కు ఈ మేరకు ర్యాలీకి అనుమతివ్వాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్ నాయకులు గన్నారపు రమేష్, గంగుల దయాకర్, పుల్లా రమేష్, రామస్వామి మాట్లాడుతూ 16న దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి పోచమ్మ మైదాన్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మికుల వ్యతిరేక విధానాలకు నిరసనంగా దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాశం రవి, యాకూబ్, యాదగిరి, ఎ. సుధాకర్, ఏలేందర్ పాల్గొన్నారు.

» సంగెం: కేంద్రం రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిందని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా నాయకులు ఇస్మాయిల్ అన్నారు. సోమవారం కుంటపల్లిలో 16న భారత్ బంద్ కార్యక్రమంపై రౌండ్‌టేబుల్ సమావేశం దుబ్బాక రాజు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ 16న నిర్వహించే గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో గోనే రాంచందర్, రౌతు శ్రీనివాస్, గుండేటి స్వామి, వెంకన్న, అశోక్ పాల్గొన్నారు.

జాతీయ సమావేశాల కరపత్రం ఆవిష్కరణ

గిర్మాజిపేట, ఫిబ్రవరి 12: కేరళ రాష్ట్రం అలువా పట్టణంలోని వైఎంసీఏలో మార్చి2 నుంచి 5 వరకు జరిగే అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ జాతీయ సమావేశాల కరపత్రాన్ని సోమవారం నగరంలోని తెలంగాణ రైతు సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఎం.చందర్ రావు ఆవిష్కరించి మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం పంటలకు గిట్టుబాటు ధర, సమగ్ర వ్యవసాయ విధానం రూపొందించాలన్నారు. విశ్రాంత న్యాయమూర్తి చైర్మన్‌గా, ఇద్దరు మహిళలు సభ్యులుగా రుణ విముక్తి కమిషన్‌ను నియమించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం కార్యదర్శి గోనే కుమార స్వామి నాయకులు బల్సూకూరి నర్సయ్య, నాగర్ల శంకర్ పాల్గొన్నారు.

అంతరాయం లేని విద్యుత్‌ను సరఫరా చేస్తాం

శంభునిపేట, ఫిబ్రవరి 12 : వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని ఎన్పీడీసీఎల్ వరంగల్ డీఈ శెంకేశి మల్లికార్జున్ అన్నారు. నగరంలో గ్రామదేవతల ఉత్సవాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉండటం, వేసవి కాలం సమీపిస్తున్నందున సోమవారం డీఈ మల్లికార్జున్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను పరిశీలించారు. రంగశాయిపేట, శంభునిపేటలో పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో రంగశాయిపేట ఏడీఈ సర్వేశ్వర్, ఏఈ సంపత్, లైన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, రాజు పాల్గొన్నారు.

'ఇంటర్‌సిటీ' శాశ్వత హాల్టింగ్ కోసం రైల్వే ఫోరం కృషి

నెక్కొండ, ఫిబ్రవరి 12 : నెక్కొండ పరిసర తొమ్మిది మండలాల ప్రయాణికుల విజ్ఞాపనల మేరకు నెక్కొండ రైల్వేస్టేషన్‌లో నూతనంగా ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్‌కు రైల్వే అధికారులు అనుమతి ఇచ్చారు. గత నెల 30 నుంచి నెక్కొండ స్టేషన్‌లో రైలు ఆగుతోంది. అయితే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు రైల్వే అధికారులు మూడు నెలల పాటు ప్రయోగాత్మక హాల్టింగ్ ఇచ్చారు. ఈ గడువులో రైల్వే శాఖకు టికెట్స్ ద్వారా వచ్చే ఆదాయాన్ని పరిగణంలోకి తీసుకున్న అనంతరం హాల్టింగ్ కొనసాగించాలా లేదా.. అనే విషయంపై నిర్ణయం తీసుకుంటారు. రాజకీయాలకు అతీతంగా ఏర్పడిన రైల్వే టికెట్ల ఫోరం కమిటీ సభ్యులు నిత్యం ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ అప్‌అండ్ డౌన్‌నెక్కొండకు వస్తున్న సమయంలో స్టేషన్‌కు వెళ్లి ప్రయాణికులను ఇంటర్‌సిటీకి టికెట్‌తీసుకోవాలని కోరుతున్నారు. తక్కువ మంది ప్రయాణికులు ఉన్న రోజుల్లో ఫోరం సభ్యులు రైలు హాల్టింగ్ రద్దు కావద్దన్న ఉద్దేశంతో స్వచ్ఛందంగా నిధులను సమకూర్చుకుని టికెట్లను తీసుకుంటున్నారు. రైల్వే టికెట్స్ ఫోరం చేస్తున్న కృషిని పలువురు అభినందిస్తున్నారు.


టికెట్లను కొనుగోలు చేస్తున్న ఫోరం సభ్యులు

ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

గీసుగొండ, ఫిబ్రవరి 12: మొగిలిచర్ల జెడ్పీ పాఠశాల విద్యార్థులు 40 మందికి నేతాజీ సర్వీస్ టీం(ఎన్ఎస్‌టీ) ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనిత, పీఈటీ ముఖర్జీ, బొట్టు వినయ్, ఎన్ఎస్‌టీ సభ్యులు బరుపటి అనిల్‌కుమార్, సాయి, వెంకటేశ్, హరీష్, నాగరాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL మంగళవారం 13 ఫిబ్రవరి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

షార్ట్ సర్క్యూట్‌తో గడ్డి వాము దగ్ధం

రాయపర్తి, ఫిబ్రవరి 12 : మండలంలోని పెర్కవేడు గ్రామ శివారులో రహదారిపై ట్రాక్టర్‌లో గడ్డి వ్యాపారస్తులు గడ్డిని తరలిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గణేష్ కుంట తండాకు చెందిన వ్యాపారస్తులు నరేష్, వీరు నాయక్‌లు గడ్డిని తీసుకుని ట్రాక్టర్‌లో అన్నారం నుంచి పెర్కవేడు వైపు వెళ్తుండగా విద్యుత్ తీగలు తగిలి మంటలు అంటుకున్నాయి. దీంతో వెంటనే ట్రాక్టర్ డ్రైవర్ చాకచక్యంగా లిఫ్ట్ ద్వారా గడ్డిని కింద పడవేయగా, అంటుకున్న మంటలను స్థానికులు ఆర్పివేశారు. దీంతో భారీ ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో దాదాపు రూ. 50 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. విద్యుత్ తీగలు కిందికి వేళాడుతూ ఉండడం తోనే ప్రమాదం జరిగిందని, విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపించారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్

వర్ధన్నపేట, ఫిబ్రవరి 12: కృష్ణా నదిపై శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలను కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని నిరసిస్తూ ఈనెల 13న (మంగళవారం) నల్గొండలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడం వల్ల రాష్ట్రానికి జరిగే నష్టాలను ప్రజలకు వివరించడానికి, తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నల్గొండ జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభ నిర్వహించతలపెట్టినట్లు తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆరూరి కోరారు.

ఊర చెరువు నీటిని కాపాడాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

వర్ధన్నపేట, ఫిబ్రవరి 12: ఊరు చెరువు నుంచి కొందరు అక్రమంగా మోటార్లు పెట్టి అక్రమంగా నీటిని తోడివేయడంతో నష్టపోవాల్సి వస్తోందని మండలంలోని ఇల్లంద గ్రామ రైతులు వర్ధన్నపేట తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. కొందరి స్వప్రయోజనాలతో చెరువు నీరు వృథా కావడమే కాకుండా పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మోటార్లు బిగించి నీటిని వినియోగించుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తహసీల్దార్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా విశ్వప్రసాద్

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 12 : తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నర్సంపేట తహసీల్దార్ కె. విశ్వప్రసాద్‌ను టీజీటీఏ వ్యవస్థాప కుడు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సోమవారం నర్సంపేట తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులు విశ్వప్రసాద్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీటీ రాజ్‌కుమార్, ఆర్ఐ రజాక్, యూసుఫ్‌అలీ, దశరథం, సాయి, గణేష్, సంజీవ, శోభ, స్వామి పాల్గొన్నారు.

బదిలీ అయిన ఎంపీడీవోకు సన్మానం



బదిలీ అయిన ఎంపీడీవోను సన్మానించిన తోటి అధికారులు

నల్లబెల్లి, ఫిబ్రవరి 12: నల్లబెల్లి ఎంపీడీవో నంద విజయ్‌కుమార్ హన్మకొండ జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో తోటి అధికారులు, సిబ్బంది విజయ్‌కుమార్‌ను శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీవో కూచన ప్రకాశ్ మాట్లాడుతూ.. నల్లబెల్లి ఎంపీడీవోగా నంద విజయ్‌కుమార్ 3 సంవత్సరాల పాటు విధులు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ అంజయ్య, టైపిస్ట్ గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు సుధాకర్, ధర్మేందర్, పద్మనాభస్వామి, శాంత, రాజు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

కార్మికసంఘాల నాయకుల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు పంజాల రమేశ్

నర్సంపేట, ఫిబ్రవరి 12 : కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలపై ఈనెల 16 జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐఎఫ్‌టీయూన్యూ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేషం పిలుపునిచ్చారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏఐఎఫ్‌టీయూన్యూ కార్మికసంఘం నాయకులతో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. పూర్వపు కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్‌కోడ్‌లను అమలు చేసి కార్మికులకు తీరని అన్యాయం చేసిందన్నారు. వ్యవసాయరంగంలో కార్పొరేట్ అనుకూల చట్టాలను తీసుకువచ్చి వ్యవసాయదారుల మనుగడను దెబ్బతీసే విధానాలను వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివాసీలను అడవులనుంచి వెళ్లగొట్టి కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడానికి బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు బొల్లి శ్రీనివాస్, గాదం రవి, మేరుగు జనార్దన్, గడ్డం శ్రీను, బాదావత్ చందర్, రాములు, కొమురయ్య. భూక్యరాజు, భద్రు, దయాకర్, రాజ య్య, శ్యామ్ పాల్గొన్నారు.

అలాగే పట్టణంలో సోమవారం ప్రజాసంఘాల నాయకులు రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ 16న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను నర్సంపేట నియోజకవర్గంలోని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, రైతులు, ప్రజా సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, రైతుసంఘ జిల్లాఉపాధ్యక్షుడు కొరబోయిన కుమారస్వామి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, సీఐటీయూ జిల్లాకార్యదర్శి అనంతగిరి రవి తదితరులు పాల్గొన్నారు.

కోడి భవ్య విగ్రహ ఆవిష్కరణ



భవ్య విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

ఖానాపురం, ఫిబ్రవరి 12: ఈ నెల 3న యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో మృతి చెందిన బుధరావుపేట గ్రామానికి చెందిన కోడి భవ్య విగ్రహ ఆవిష్కరణ, సంస్మరణ సభ సోమవారం బుధరావుపేటలో ప్రజా సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు వాసు, ఆల్‌ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్, స్వాతంత్ర సమయయోధుల సంఘం అధ్యక్షురాలు వనితక్క, ఓయూ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజారాంలు ముఖ్య అతిథిగా హాజరై విగ్రహ ఆవిష్కరణలో పాల్గొని మాట్లాడారు. భవ్య, వైష్ణవిలది ఆత్మహత్య కాదని, అది ముమ్మాటికీ హత్యేనని ఆరోపించారు. విద్యార్థుల మరణాలపై జ్యుడీషియల్ విచారణ చేయించి అందుకు బాధ్యులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల కుటుంబాలకు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియాలతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇల్లు కేటాయించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పట్టించుకొని యెడల బాధిత కుటుంబాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల మృతికి నివాళులర్పించారు. కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు తోటకూరి రాజు, ప్రజా సంఘాల నాయకులు భరతక్క, జ్యోతిఅక్క, అరుణఅక్క, చాపర్తి కుమార్, సిద్ధిరాజ్ యాదవ్, జనగాం కుమార్, రమ, అనిత, భవ్య తల్లిదండ్రులు కృష్ణ-లలిత, మాజీ సర్పంచ్ కాస ప్రవీణ్‌కుమార్, మౌళానా పాల్గొన్నారు.

రాయపర్తి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సందీప్



రాయపర్తి, ఫిబ్రవరి 12 : మండల నూతన ఎస్ఐగా వడ్డె సందీప్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల కమిషనరేట్ పరిధిలో జరిగిన బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న విజయ్ కుమార్ బదిలీపై వెళ్లగా నూతనంగా సందీప్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలు సహకరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

అనుమతి లేకుండా ఇసుకను తవ్వితే చర్యలు తప్పవు



సీజ్ చేసిన జేసీబీ, ట్రాక్టర్‌ను చూపుతున్న ఎస్ఐ

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 12 : ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. మండలంలోని ల్యాబర్తి ఆకేరు వాగులో అక్రమంగా ఇసుకను తవ్వుతున్న జేసీబీని, తరలిస్తున్న 6 ట్రాక్టర్లను పట్టుకుని ఆదివారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను విరుద్ధంగా ఆకేరు వాగులో, పరిసరా ప్రాంతాల్లో అక్రమంగా మట్టిని, ఇసుకను తవ్వుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా నడిపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వర్ధన్నపేట, ఫిబ్రవరి 12: కృష్ణా జలాల మీద నల్గొండ జిల్లాలో మాజీ సీఎం కేసీఆర్ నిర్వహించతలపెట్టిన బారీ బహిరంగసభను నిరసిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్ సెల్ పిలుపు మేరకు వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు మాట్లాడుతూ దొంగే దొంగ దొంగ అన్నట్లుగా కేసీఆర్ తీరు ఉందన్నారు. పది సంవత్సరాలు పాలమూరు ప్రాజెక్టులపై వివక్ష చూపి ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టులకు 2015లో శంకుస్థాపన చేసిన కేసీఆర్ దిగిపోయే వరకు కూడా 40శాతం పనులు ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల మహబూబ్‌నగర్ జిల్లాకే కాకుండా రంగారెడ్డి జిల్లాకు కూడా 3 లక్షల ఎకరాలకు సాగునీరు, నల్గొండ జిల్లాకు 30వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వకుండా మాట నిలుపుకోలేని మీరు ఏ ముఖం పెట్టుకొని నల్గొండకు వెళ్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన 60 రోజులలోపే కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతల ప్రాజెక్టుకు జీవో నెంబరు 14 ద్వారా రూ. 2945 కోట్లు విడుదల చేసి సుమారు 3 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చే కార్యక్రమం మొదలుపెట్టి నిబద్ధతను చాటుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏటూరునాగారం ఐటీడీఏ పీవో బదిలీ

• నూతన పీవోగా చిత్రామిశ్రా



అంకిత్



చిత్రామిశ్రా

ములుగు, ఫిబ్రవరి 12: ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్ బదిలీ అయ్యారు. నిజామాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన స్థానంలో నిజామాబాద్ అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న చిత్రామిశ్రాను నియమించింది. వీరిద్దరూ 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. 2022 జూన్ 13న ఏటూరునాగారం ఐటీడీఏ పీవోగా బాధ్యతలు స్వీకరించిన అంకిత్ సమర్థవంత అధికారిగా మన్ననలు పొందారు. గోదావరి వరదల సమయంలో సహాయక చర్యలను చేపట్టడంలో కృషి చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ములుగు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. మేడారం మహాజాతర కోసం ఐటీడీఏ ద్వారా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తూ చాలా వరకు పనులను ఇప్పటికే పూర్తిచేయించారు.

నర్సరీలలో మొక్కల పెంపకం చేపట్టాలి

చెన్నారావుపేట, ఫిబ్రవరి 12: నర్సరీలల్లో మొక్కల పెంపకాన్ని చేపట్టాలని ఎంపీవో శ్రీధర్‌రాజు అన్నా రు. సోమవారం మండలంలోని తిమ్మారాయిన్‌పహాడ్‌లో నర్సరీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలల్లో మొ క్కల పెంపకాన్ని త్వరితగతిన విత్తనాలను నాటాలన్నారు. ప్రతీ రోజు మొక్కలను పరిశీలించటం జరుగుతుందన్నారు.

కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు



గెలుపొందిన దుగ్గొండి విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పర్వతగిరి, ఫిబ్రవరి 12: జాతీయ ఆహ్వానిత కరాటే చాంపియన్‌షిప్ -2024లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి స్వర్ణ, కాంస్య పతకాలను సాధించిన మండలంలోని ఏనుగల్లు గ్రామానికి చెందిన విద్యార్థులను పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు అభినందించారు. నర్సంపేటలో ఈనెల 11న జరిగిన కరాటే చాంపియన్‌షిప్‌లో గ్రామానికి చెందిన గూడ అద్వైత్ అలంకృత్‌వర్మ, తమ్మిశెట్టి మనీష్, అక్షిత్, గుండారపు భీంరావు, దాసరి సాత్విక్‌లు గోల్డ్‌మెడల్స్‌తో పాటు బుక్క అర్జున్ పటేల్ కాంస్యపతకం సాధించాడు. దీంతో విద్యార్థులను సోమవారం ఎంపీటీసీ కోల మల్లయ్యయాదవ్, మాజీ సర్పంచ్ సంధ్యారాణి నర్సింగం, మాజీ ఉపసర్పంచ్ గుండారపు సతీష్‌రావు, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు గూడ నరేందర్‌వర్మ, నాయకులు కానుగంటి వెంకటేశ్వర్లు, నల్లెల వెంకన్న, బాలచందర్ అభినందించారు.

● దుగ్గొండి: మండలంలోని గిర్నిబావి జ్యోతిరావుపూలే బాలుర విద్యాలయంలో చదువుచున్న పలువురు విద్యార్థులు నర్సంపేటలో 11న జరిగిన జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్ షిప్‌లో పాల్గొని గెలుపొందగా వారిని సోమవారం ప్రిన్సిపాల్ దేవేందర్, ఉపాధ్యాయులు అభినందించారు. వివిధ భాగాలలో గెలుపొందిన విద్యార్థులు జి. వర్షిత్, ఎం. విజయ్, జి.రామ్, చరణ్, భవ్యతేజ, అఖిల్, సిద్ధు, అక్షిత్‌కుమార్, హర్షలు వివిధ విభాగాలలో ప్రథమ స్థానం పొంది గోల్డ్ మెడల్ పొందినట్లు ప్రిన్సిపాల్ దేవేందర్ వెల్లడించారు. డి. సాయి, చరణ్, లక్ష్మిప్రసాద్, రాంతేజ్, అవినాష్‌లు ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ పొందారు. పి. వికాస్, హర్షిత్, అఖిల్, వర్షిత్, సాయి, చరణ్‌లు తృతీయ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ పొందారు. కొంత మంది స్పారింగ్, కుముతే విభాగాలలో గెలుపొందినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

పర్వత గిరి, ఫిబ్రవరి 12: మండలంలోని వడ్లకొండలో రంగనాయకులస్వామి గుట్ట ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన కోదాటి కమలమ్మ-మాధవరావుల కుమారుడు కుమార్‌రావు-సుధ దంపతులు రూ.51, 116, కోదాటి హేమలత-సుధాకర్ దంపతులు రూ.20, 116 విరాళంగా కమిటీ నిర్వాహకులకు సోమవారం అందించారు.

ఉత్సవ విగ్రహం కోసం ఆర్థిక సాయం

చెన్నారావుపేట, ఫిబ్రవరి 12: మండలంలోని పాపయ్యపేటలో చేపట్టనున్న కంఠమహేశ్వర స్వామి ఉత్సవాలకు ఎల్లమ్మతల్లి విగ్రహాన్ని అందిస్తామని దాతలు సోమవారం తెలిపారు. బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన బుడిగే మానస- సతీష్ , లక్ష్మీ- వెంకటయ్యగౌడ్‌లు ఆలయంలోని ఎల్లమ్మతల్లి విగ్రహాల కోసం రూ. 60 వేలను అందిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు దాతలను అభినందించారు.

ఈ కార్యకమంలో పెద్ద మనిషి మేడి ప్రభాకర్‌గౌడ్, కుల సంఘం అధ్యక్షుడు బుడిగే నరేందర్, బండి రమేష్, బుడిగే వెంకటేశ్వర్లు, మేడి వెంకటేశ్వర్లు, తాళ్ల సమ్మయ్య, బత్తిని ఏకాంతం, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

బోరువెల్ పనులు ప్రారంభం

చెన్నారావుపేట, ఫిబ్రవరి 12: మండలంలోని తిమ్మారాయిన్‌పహాడ్ గ్రామ శివారు చంద్రు తండాలో బోర్‌వెల్ పనులను కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సీడీఎఫ్ నిధులతో రానున్న వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చటం కోసం చేతి పంపు నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఏటికూరి జయరాజు, పాపారావు, మంద విజయ్, నరేష్, రాయన్న, మంద యాకయ్య, హరిలాల్, చంద్రు, రవి, రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్‌లో బహుమతులు సాధించిన విద్యార్థులు



డీఈవో చేతుల మీదుగా బహుమతులు అందుకుంటున్న చెన్నారావుపేట విద్యార్థులు

చెన్నారావుపేట, ఫిబ్రవరి 12: మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఇన్స్‌పైర్‌లో బహుమతులు సాధించారు. పాఠశాలలో చదువుతున్న అందె స్పందన కల్లెపు శ్రీజ, అనుమాండ్ల భార్గవిలు ఇన్స్‌పైర్‌లో, సైన్స్‌ఫెయిర్, కవితల పోటీలల్లో పాల్గొని బహుమతులను సాధించడంతో డీఈవో వాసంతి, డీఎస్‌వో శ్రీనివాస్ చేతుల మీదుగా సోమవారం బహుమతులు అందుకున్నట్లు హెచ్‌ఎం జయ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసాపత్రంతో పాటు షీల్డ్‌ను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలాజీరావు, గజవెల్లి సుందర్ తదితరులు పాల్గొన్నారు.

● నల్లబెల్లి : రాష్ట్ర స్థాయి ఇన్స్‌పైర్ మాక్ పోటీలకు కేబీఎస్‌లో పదో తరగతి విద్యార్థిని అవంతిక ఎంపికైందని పాఠశాల కరస్పాండెంట్ మేడవరపు కమలాకర్‌రావు తెలిపారు. సోమవారం జిల్లా రీజనల్ సైన్స్ కేంద్రంలో డీఈవో వాసంతి జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ చేతుల మీదుగా అవంతిక, ఉపాధ్యాయుడు శివలు జిల్లా స్థాయి ఇన్స్‌పైర్ మాక్ అవార్డ్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా కమలాకర్‌రావు మాట్లాడుతూ.. జనవరిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అవంతిక బైక్ విత్ సూపర్ ప్రొటెక్షన్ అనే ప్రాజెక్ట్‌ను ఈ పోటీల్లో ప్రదర్శించి జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరించిందన్నారు. అనంతరం విద్యార్థినికి అవార్డు అందజేసి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రకటించారు. అవంతికను కేబీఎస్ యాజమాన్యం పోనుగొంటి రామారావు, గాదె రాజిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు గాదె రణధీర్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

'ఇంటర్‌సిటీ' శాశ్వత హాల్టింగ్ కోసం రైల్వే ఫోరం కృషి

• స్వచ్ఛందంగా నిధులు సమకూర్చి టికెట్లు కొనుగోలు



ఇంటర్ సిటీ టికెట్స్ తీసుకోవాలంటూ ప్రయాణికులను కోరుతున్న ఫోరం సభ్యులు

నెక్కొండ, ఫిబ్రవరి 12 : నెక్కొండ పరిసర తొమ్మిది మండలాల ప్రయాణికుల విజ్ఞాపనల మేరకు నెక్కొండ రైల్వేస్టేషన్‌లో నూతనంగా ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్‌కు రైల్వే అధికారులు అనుమతి ఇచ్చారు. గత నెల 30 నుంచి నెక్కొండ స్టేషన్‌లో రైలు ఆగుతోంది. అయి తే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు రైల్వే అధికారులు మూడు నెలల పాటు ప్రయోగాత్మక హాల్టింగ్ ఇచ్చారు. ఈ గడువులో రైల్వే శాఖకు టికెట్స్ ద్వారా వచ్చే ఆదాయాన్ని పరిగణంలోకి తీసుకున్న అనంతరం హాల్టింగ్ కొనసాగించాలా లేదా.. అనే విషయం పై నిర్ణయం తీసుకుంటారు. రాజకీయాలకు అతీతంగా ఏర్పడిన రైల్వే టికెట్ల ఫోరం కమి టీ సభ్యులు నిత్యం ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ అప్‌అండ్ డౌన్ నెక్కొండకు వస్తున్న స మయంలో స్టేషన్‌కు వెళ్లి ప్రయాణికులను ఇంటర్ సిటీకి టికెట్ తీసుకోవాలని కోరుతున్నారు. తక్కువ మంది ప్రయాణికులు ఉన్న రోజుల్లో ఫోరం సభ్యులు రైలు హాల్టింగ్ రద్దు కావద్దన్న ఉద్దేశంతో స్వచ్ఛందంగా నిధులను సమకూర్చుకుని టికెట్లను తీసుకుంటున్నారు. రైల్వే టికెట్స్ ఫోరం చేస్తున్న కృషిని పలువురు అభినందిస్తున్నారు.

పారిశుధ్య సేవకు సిద్ధం

5వ పేజీ తరువాయి

సమావేశంలో అధికారులకు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. 40 ఏళ్ల లోపు వయస్సు ఉన్న కార్మికులను ఎంపిక చేసేందుకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అంతే కాకుండా కార్మికుల ఆరోగ్య పరిస్థితులు, గత జాతరల్లో విధులు నిర్వహించిన వారి అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజారోగ్య అధికారులు

మేడారం జాతరలో పారిశుధ్య కార్మికుల విధుల నిర్వహణ, కార్మికులకు వసతి ఇతరత్రా సౌకర్యాల ఏర్పాటు తదితర అంశాల పరిశీలన కోసం జీడబ్ల్యూఎంసీ ప్రజారోగ్య అధికారులు ఒకటి రెండు రోజుల్లో మేడారం వెళ్లనున్నారు. జాతర ప్రారంభానికి ముందుగానే అధికారులు, కార్మికుల సేవలు ఆరంభమవుతాయి. ఇప్పటికే భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో ఈ సారి పారిశుధ్య సేవలు విస్తృతం అవుతాయనే అంచనాల్లో అధికారులు ఉన్నారు. పోస్టు జాతర సేవలను దృష్టిలో ఉంచుకొని పారిశుధ్య కార్మికులు 25వ తేదీ వరకు మేడారంలోనే ఉంటారు.

కార్మికులను సిద్ధం చేస్తున్నాం : సీఎంహెచ్‌వో రాజేశ్



మేడారం జాతర కోసం కార్మికులను సిద్ధం చేస్తున్నాం. ఈ మేరకు సమావేశాలు ఇప్పటికే నిర్వహించాం. మరిన్ని సమావేశాల నిర్వహణతో కార్మికులను సంసిద్ధులను చేసే ప్రణాళికతో ఉన్నాం. ముఖ్యంగా కార్మికుల ఎంపికలో వారి ఆరోగ్య పరిస్థితిని ప్రధానంగా తీసుకుంటున్నాం. వాహనాలు సిద్ధం చేసుకున్నాం. జాతరలో కార్మికులకు వసతి, భోజన సౌకర్యం, మహిళలకు ప్రత్యేకంగా వసతుల కల్పన తదితర అంశాలను పరిశీలించేందుకు ఒకటి రెండు రోజుల్లో మేడారానికి వెళ్లనున్నాం.